పది విద్యార్థుల పస్తులు!

● ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు ప్రత్యేక తరగతులు ● అందని అల్పాహారం ● పస్తులుంటున్న విద్యార్థులు

భైంసా, ఫిబ్రవరి 4: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందక పస్తులుంటున్నారు. ఉత్తీర్ణశాతాన్ని పెంచే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. నవంబర్ ఒకటవ తేది నుంచి ఒక పూట మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించగా, జనవరి ఒకటో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరం ప్రత్యేక తరగతుల నేపథ్యంలో జనవరి ఒకటో తేది నుంచి ఏప్రిల్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సారి జనవరి ముగిసి ఫిబ్రవరి వచ్చినా అల్పాహారం అందివ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలో 116 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 1548 బాలికలు, 2053 మంది బాలురు కలుపుకొని మొత్తం 3601 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరంతా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. జిల్లాలో గత సంవత్సరం పదో తరగతిలో 99 శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.. ఈ సారి అన్ని పాఠశాలల్లో శతశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో డీఈవో రవీందర్ రెడ్డి నేతృత్వంలోని జిల్లా విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. గత యేడాది అల్పాహారం కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఐదు రూపాయల చొప్పున ఇచ్చింది. కానీ ఈసారి పథకాన్ని అమలు చేయడం లేదు.



ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థినులు

● నీరసించి.. విద్యార్థుల అవస్థలు

ప్రత్యేక తరగతుల నేపథ్యంలో ఉదయం గంట ముందు వచ్చి సాయంత్రం గంట ఆలస్యంగా ఇంటికి వెలుతున్న విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8.30 గంటలకే పాఠశాలకు రావాల్సి ఉండటంతో గ్రామాల నుంచి వచ్చే వారు ఏడు గంటలకే ఇళ్లల్లో నుంచి బయల్దేరాల్సి వస్తోంది. దీంతో అరకొరగా తినివస్తున్నారు. ఒక్కోసారి వంట కాకపోవడంతో ఖాళీ కడుపులతో రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మధ్యాహ్నం వరకు నీరసానికి గురవుతున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే వారు తిరిగి ఇంటికి చేరుకునే వరకు రాత్రి 8 గంటల నుంచి 9 గంటలు అవుతోంది. దీంతో సదరు విద్యార్థులు అప్పటి వరకు ఆకలితో అలమటించి పోతున్నారు. ఈ నేపథ్యంలో దాతలు స్పందించి అల్పాహారం అందించేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం : రవీందర్‌రెడ్డి, డీఈవో

ప్రత్యేక తరగతులకు హజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అమలుపరచే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళతాం. నిధులు రాని కారణంగానే అమలు జరగడం లేదు. గత విద్యా సంవత్సరములో నిధులు రావడం మూలంగా అమలు చేశాం.

పట్టణంలో బీజేపీ పార్లమెంటరీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

● హాజరైన ఎంపీ సోయం, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాకేంద్రంలో ఆదిలాబాద్ పార్లమెంటరీస్థాయి సమీక్ష సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరుకాగా.. సంఘటన మంత్రి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూ హాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మాట్లాడుతూ.. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి మోదీ ప్రధానమంత్రి అయితేనే దేశం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. జిల్లాలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం అవిశ్రాంత పోరాటం సలుపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అల్జాపూర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే రామారావు పటేల్, అయ్యన్నగారి భూమయ్య, ఉమ్మడి జిల్లా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీఈవో ప్రవేశ పరీక్ష

ముథోల్, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సీఈవో (సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. దీనిలో భాగంగా మొత్తం 384 మంది విద్యార్థులకు 369మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. మిగతా 15మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ అమృతయ్య ఈ సందర్భంగా తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 4 : గ్రామస్థాయి నుంచి పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో ముథోల్ నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లోని లోపాలను సవరించుకుంటూ పార్టీని పూర్తి స్థాయిలో పటిష్టపరుచుకుందామని పేర్కొన్నారు. మండల స్థాయి నాయకులందరూ గ్రామ స్థాయి పార్టీ శ్రేణులను సమన్వయపరుచుకొని ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అమలులోకి తీసుకవస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యకర్తలంతా రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం సమాయత్తం కావాలని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇందులో భైంసా మాజీ ఎంపీపీ పొద్దుటూరి రాంచందర్ రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, మాజీ కోప్షన్ సభ్యుడు శంకర్ చంద్రేతో పాటు పలువురు పాల్గొన్నారు.


పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

మార్కెట్‌ను ముంచెత్తుతున్న ఆకు కూరలు

● పెరిగిన దిగుబడులు ● తగ్గిన ధరలు

భైంసా, ఫిబ్రవరి 4: ప్రతి సంవత్సరం వాణిజ్య పంటలసాగుతో కష్టనష్టాల పాలవుతున్న భైంసా డివిజన్ పరిధిలోని రైతాంగం ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారించింది. ఇందులో భాగంగానే స్వల్ప వ్యవధిలో తక్కువ పెట్టుబడితో అశించిన మేర లాభాలను గడించేందుకుగాను ఆకు కూరల సాగువైపు దృష్టి సారించింది. ప్రధానంగా సాగు నీటి వ్యవస్థ గల ఇక్కడి ప్రాంత రైతాంగం కూరగాయల సాగువైపు దృష్టి సారించింది. ప్రస్తుత రబీ సీజన్‌లో కూరగాయాలలో భాగంగా ఆకు కూరల సాగును అధికంగా చేపడుతున్నారు. ఇందులో పాలకూర,మెంతి కూర,కొత్తిమీర, పుదీనా పంటల సాగుబడిపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఈక్రమంలో సంబంధిత పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ఇది వరకు భైంసా డివిజన్ పరిధిలో 750 హెక్టార్ల వరకు ఉన్న ఆకుకూరల సాగు ప్రస్తుతం 1400 హెక్టార్ల వరకు పెరిగింది. ప్రస్తుతం డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సాగులోనున్న పాల, మెంతి కూర దిగుబడులు విక్రయానికి సిద్దమ య్యాయి. రైతాంగం వాటిని విక్రయించేందుకు గాను భైంసా మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ప్రాంతాల రైతులు విక్రయం కోసం తీసుక వస్తుండటంతో ఆకుకూరలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. భైంసా పట్టణంలో రోజువిక్రయాలు జరిగే హోల్ సేల్ మార్కెట్‌తో డివిజన్ వ్యాప్తంగా జరిగే వారంతపు సంతల్లో సైతం ఆకుకూరలు ముంచెత్తుతున్నాయి. డిమాండ్‌ను మించిఆకు కూరలు మార్కెట్‌కు వస్తుండటంతో ధరలు తగ్గు దలతో లభ్యవముతున్నాయి. ఇది వరకు పాల కూర కట్ట రూ.10లకు ఒకటి లభ్య మవ్వగా ప్రస్తుతం ఇదే ధరకు రెండు నుంచి మూడు కట్టలు లభ్యమవుతు న్నాయి.ఇక రూ.15కి కట్ట చొప్పున లభ్యమయ్యే మెంతికూర కట్టలు ప్రస్తు తం ఇదే ధరకు మూడు నుంచి నాలుగు చొప్పున లభ్యమవుతు న్నాయి. ఎంతో ప్రయోజనకమైన ఆకు కూరలు తక్కువ ధరకు లభిస్తుం డటంతో వినియోగదారులు ఎగబడి కొనుగోళ్లు చేపడుతున్నారు.


మార్కెట్లో విక్రయానికి తీసుకవచ్చిన పాలకూర కట్టలు

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి: జడ్పీటీసీ


లక్ష్మణచాంద,ఫిబ్రవరి4: రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కుల గణన వెంటనే చేపట్టాలని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఆదివారం డిమాండ్‌చేశారు. పంచాయతీ ఎన్నికలంటే ముందే ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ కుల గణన పూర్తయితే అధిక స్థానాల్లో బీసీలు పోటీ చేసే అవకాశం ఉందన్నారు. అన్ని రంగాల్లో బీసీ లకు ప్రాధాన్యత లభించాలని అభిలాషించారు. 40 శాతం రిజర్వేషన్ పెంపుకోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో బీసీల సత్తా చాటుదామని పిలుపునిచ్చారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

తానూర్,ఫిబ్రవరి 4: మండల కేంద్రం తానూర్‌కు చెందిన బోనాల సాయినాథ్(22) అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మ హత్య చేసుకున్నట్లు ఎస్సైలోకం సందీప్ తెలిపారు. వివారాల ప్రకారం మృతుడు సాయినాథ్ గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై నిత్యం మందు సేవించేవాడు.ఈ క్రమంలో శనివారం సాయంత్రం మద్యం తాగుతూ తన చేనులోని చెట్టు ఉరివేసుకొని మరిణించినట్లు తండ్రి పోతన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.







ఉపాధిపై నిర్లక్ష్యం

- జిల్లాలో 'ఉపాధి హామీ' పారదర్శకతపై నిర్లక్ష్యపు నీడ
- క్షేత్రస్థాయిలో కనిపించని పర్యవేక్షణ
- తూ తూ మంత్రంగానే ముగుస్తున్న సామాజిక తనిఖీలు
- అక్రమార్కులకు అధికారులు, ప్రజాప్రతినిధుల వత్తాసు
- గతంలో సస్పెండ్ అయిన వారికి మళ్లీ పోస్టింగ్‌లు
- అవినీతిపరులపై అధికారులు ఇకనైనా చర్యలు తీసుకునేనా!?


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఖానాపూర్, ఫిబ్రవరి 4 : ఉన్నచోటనే వారికి ఉపాధి క ల్పించాలనే గొప్ప లక్ష్యంతో పురుడు పోసుకున్న మహా త్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై ప్రస్తుతం నిర్లక్ష్యపు నీడ కొనసాగు తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే పనులు పారదర్శకంగా జరగ డం లేదనే విమర్శలు వినిపిస్తున్నా యి. పనుల నిర్వహణ తదితర అం శాలను పట్టించుకోని క్షేత్రస్థాయి సిబ్బంది కొంతమందితో కలిసి ఉపాధి హామీ కూలీల వద్ద నుంచి ఆయా గ్రామాల్లో డబ్బులను వసూ లు చేస్తూ మండల, జిల్లాస్థాయి అధికారుల వరకు ము డుపులు చెల్లిస్తు న్నట్లు జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక జరిగిన ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీలపై ప్రజల్లో పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారుల అండదండలతో క్షేత్రస్థాయిలో జరు గుతున్న అవకతవకలను కప్పిపుచ్చుకొని సిబ్బంది బయటపడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పనిలో జరుగుతున్న అవకత వకలపై ఒకవేళ చర్యలు చేపట్టినా అవి తూతూ మంత్రంగానే ఉంటుం డడంతో చేసిన తప్పులే మళ్లీ పునరావృతం అవుతున్నట్లు చె బుతున్నా రు. అధికారులు ఎన్నిసార్లు సస్పెండ్ చేసినా.. పైరవీలతో తిరిగి విధుల్లో చేరుతున్న ఉపాధి హామీ సిబ్బంది అడ్డూ అదుపు లేకుండా వ్యవహరి స్తున్నారు. ఇటీ వల ఖానాపూర్‌లో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. లక్షల్లో అవ కతవకలు జరిగాయని రికార్డులకు జరి గిన పనికి ఎక్కడ కూడా పొం తన కుదరడం లేదని సా మాజిక తనిఖీ బృందాలు ప్రజావేది కలో వెల్ల డించినప్ప టికీ అధికారులు మాత్రం రూ. 16,114 రికవరీతో సరి పెట్టడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● తూతూ మంత్రంగా తనిఖీలు

గతంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ వచ్చిందం టే.. ఇటు సిబ్బం దిలో అటు అధికారుల్లో ఒక రకమైన భ యం కనిపించేది. కానీ ప్రస్తు తం క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి మండల, జిల్లా స్థాయి అధికారు ల అండదండలు పుష్కలంగా ఉండడంతో సామాజిక తనిఖీలు తూ తూ మంత్రంగా మారు తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సుమా రు ఒక్కో గ్రామంలో నాలుగైదు రోజుల పాటు ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న తనిఖీ బృందాలు ఆయా గ్రామాల్లో జరిగిన అవకత వకలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చాయి. వాటిని పరిశీ లించిన జిల్లా అధికారులు సైతం క్షేత్రస్థాయి సిబ్బందిపై ప్రజా వేదికలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తనిఖీ బృందాలు తేల్చిన వివరా లు పరిశీలించి సిబ్బందిపై మండల స్థాయి అధికారులపై చర్యలు తీసుకుంటారని భావించినప్పటికీ.. కేవలం తూతూ మంత్రపు చర్యలు తీసుకోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. లక్షల్లో అవకతవకలు జరిగినట్లు తేల్చడం దేనికి.. కేవలం నామమాత్రపు రికవరీలు రాయ డం దేనికని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో గ్రామంలో నే కేవలం రూ. 6 లక్షల నుంచి 7 లక్షల వరకు పనులకు నిధులకు పొంతనలేదని సామా జిక తనిఖీ బృందాలు తేల్చాయి. కాగా.. మండలం మొత్తం రూ. 16,114 మాత్రమే రికవరీ రాయడం.. రూ. 39,000 పెనాల్టీలు విధించడ ం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికా రులు తేల్చిందే నిజమై తే సామాజిక తనిఖీ బృందాలకు అవగాహన లేనట్టా... లేక సామాజిక తనిఖీ బృందాలు తేల్చిందే నిజమైతే అధికారులు సిబ్బందితో కుమ్మక్కై నట్లా అనే అనుమానాలను క్షేత్రస్థాయిలో ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

● అక్రమార్కులకు అధికారుల అండ

ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై సామాజిక తనిఖీ బృందాలు లెక్కలను తేలుస్తున్నప్పటికీ సిబ్బందికి అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయని చెబుతు న్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన అవకతవకలను ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందాలు వెల్లడిస్తున్న సమయంలో కొంతమంది ప్రజాప్రతినిధు లు అడ్డుకుంటూ సిబ్బందికి అండగా నిలుస్తున్నారు. మండ ల, జిల్లా స్థాయి అధికారులను సైతం ప్రభావితం చేస్తూ ఉపాధి హామీ సిబ్బంది ని కంటికి రెప్పలా కాపాడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అం దుకు కారణం క్షేత్రస్థాయిలో జరుగుతున్న లావాదేవీలేనని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిబంధనల ప్ర కారం చేయకపోయినప్పటికీ.. బిల్లులను చెల్లించినందుకు గాను ఒక్కో కూలీ వద్ద నుంచి వారానికి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆ రోపణలు ఉన్నాయి. ఈ డబ్బులను కొంతమంది ప్రజాప్రతినిధు లతో పాటు ఆయా గ్రామాల్లో పని చేసే పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసి స్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సేకరించి గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు ముట్ట చెబుతున్నారని పలువురు చెబుతున్నారు. జరగని పనులకు సైతం కొన్నిచోట్ల బిల్లులను కాజేస్తున్నారని ఆరోపణలున్నాయి.

● క్వాలిటీ కంట్రోల్ నివేదిక కరువు

గత ఏడాది నిర్వహించిన సామాజిక తనిఖీ ముగిసిన తర్వాత ప్రజా వేదికలో వెల్లడించిన పలు అంశాలపై అప్పట్లో క్వాలిటీ కంట్రోల్ నివేదిక కోరుతూ జిల్లా అధికారులు సిఫార్సు చేశారు. కాగా.. ఇప్పటి వరకు క్వాలిటీ కంట్రోల్ నుంచి నివేదిక రాకపోవడం సిబ్బందిపై చర్యలు తీసు కోకపోవడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం అవకతవకలకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే తిరిగి విధుల్లో చేర్చుకోవడంతో వారు గతంలో చేసిన తప్పిదాలనే పునరావృతం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు చెబుతు న్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మె కాలంలో అప్పటి ప్రభుత్వ ం అందరినీ తొలగించి తిరిగి విధుల్లో చేర్చుకునే క్రమం లో అంతకుముందే సస్పెండ్ అయిన వారిని సైతం అధికారులు విధుల్లో చేర్చుకోవడం వెనుక ఉన్న మత లాబు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే ఖానాపూర్ లాంటి పెద్ద సెంటర్‌లో సైతం రెగ్యులర్ ఏపీవో లేకుండా ఇన్‌చార్జి ఏపీవోతో నెట్టుకు రావడం సైతం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణకు శాపంగా మారుతుందని పలువురు చెబుతున్నారు. మరో పక్క క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న పనుల్లో కొంతమంది పనులు చేయకుండా డబ్బులు ఇచ్చి హాజరు వేయించుకుని డబ్బులు కాజేస్తుండడంతో పను లు చేసిన వారు సైతం కచ్చితంగా డబ్బులు ఇచ్చి హాజరు వేయిం చుకో వాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించి మాస్టర్‌లలో హాజరు, తది తర అంశాలను పకడ్బందీగా నిర్వహిస్తే ఉపాధి హామీ నిధులు పక్క దోవ పట్టకుండా ఉంటాయి.

● మూడంచెల విధానంలో పరిశీలన జరిగేనా !?

ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో తనిఖీ బృందాలు వెల్లడించిన అంశాలపై ప్రజా వేదికలో తీసుకున్న చర్యలపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యం లో కేవలం ప్రజా వేదికలో డీఆర్డీవో తేల్చిన విషయాలు మాత్రమే ఫైన ల్ కాదని ఆ తర్వాత మూడంచెల విధానంలో సా మాజిక తనిఖీ బృం దం నివేదిక పరిశీలన జరుగుతుం దని చెబుతున్నారు. దీంతో జరిగిన అవకతవకలపై మూ డంచెల విధానంలో మొదటిదైన ప్రజావేదికలో తూతూ మంత్రపు చర్యలు మాత్రమే తీసుకున్నారని ఆరోపణలు వినిపి స్తున్న నేపథ్యంలో మూడంచెల విధానంలో తదు పరి పరిశీలన జిల్లా కలెక్టర్, సామాజిక తనిఖీ రాష్ట్ర డైరెక్టర్లు చేస్తారని చెబుతున్నారు. దీంతో కలెక్టర్, సామాజిక తనిఖీ రాష్ట్ర డైరెక్టర్ స్పందించి మూడంచెల పరి శీల న వ్యవస్థలోనైనా సామాజిక తనిఖీ బృందాల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

డీఆర్డీవో తేల్చిందే ఫైనల్ కాదు..

● విజయలక్ష్మి (డీఆర్డీవో, నిర్మల్)

ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై నిర్వహి ంచిన సామాజిక తనిఖీల్లో తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలను మూడంచెలుగా పరిశీలించడం జరుగుతు ంది. మొదట ప్రజా వేదికలో డీఆర్డీవో, రెండోసారి జిల్లా కలెక్టర్, మూడోసారి సామాజిక తనిఖీ రాష్ట్ర డైరెక్టర్ పరిశీలించి చర్యలు చేపడుతారు. ప్రజా వేదికలో డీఆర్డీ వో తేల్చినవి మాత్రమే ఫైనల్ కాదు. తప్పు చేసిన వారు కచ్చితంగా తప్పించుకోలేరు. ఇందులో ఎటువంటి అనుమానాలకు తావులేదు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవు.

క్రీడా స్ఫూర్తిని చాటడం అభినందనీయం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 4: మండలంలోని చిన్న బుగ్గారం గ్రామంలో గతనెల రోజులుగా హోరాహోరీగా సాగుతున్న అనిల్ అన్న విజయోత్స వ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు ప్రశాంతమైన వాతా వరణంలో ఆటలు ఆడి క్రీడా స్ఫూర్తిని చాటడం చాలా సంతోషకర మైన విషయం. ప్రతి ఒక్క క్రీడాకారులు చెడు వ్యసనాలకు దూరంగ ఉండి క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత చూపాలన్నారు. అదే విధంగా గ్రా మస్థులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను శాలువాతో సన్మానించారు. ఇందు లో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: నేటి ఓటమి విజయానికి నాంది అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కౌటా(బి) గ్రామంలో క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమని ఓడిపోయిన వారు రేపటి గెలుపు కోసం ప్రయత్నించా లని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాను రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని అయితే ఓటమితో ఏనాడు కుంగి పోలేదన్నారు. గెలుపు కోసం ప్రయత్నిస్తూనే తాను నేడు ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందానన్నారు. ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌటా(బి) గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

● పార్టీ మారేది లేదు: అనిల్ జాదవ్

బోథ్, ఫిబ్రవరి 4: బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, తాను ఏమాత్రం పార్టీ మారనని, కొంతమంది పార్టీ మారుస్తానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని ఎవరూ నమ్మవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తాను పార్టీ మారుతానని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాను పార్టీ మార నని అందరి సహకారంతో రాజకీయ అనుభవంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తలు ఈ విషయాన్ని నమ్మవద్దన్నారు. తుల శ్రీనివాస్ ఎంపీపీగా మండలానికి ఎన్నో సేవలు చేశారని కార్యకర్తలు ఆయన సూచన మేరకు అభివృద్ధి పనులు చేప ట్టాలన్నారు. రాబోవు ఎన్నికల్లో అందరినీ గెలిపించుకుని తీరుతానని ఎంపీపీ పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ రాజుతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.


చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొడ్డోని కుంటలో చెత్త తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఖానాపూర్, ఫిబ్రవరి 4: గత నెల 30వ తేదీన 'దుర్గంధ భరితంగా బొడ్డోని కుంట' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికా రులు స్పందించారు. ఆదివారం బొడ్డోని కుంటలో పేరుకుపోయిన చెత్తా చెదారా న్ని తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై సోషల్ మీడియా వేదికగా జోరుగా చర్చ జరగడంతో ఆదివారం అధికారులు స్పందించారు. చెత్తా చెదారం తొలగింపుతో పాటు కుంటలో చేరుతున్న మురికి నీటిని మళ్లించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

‘రాజకీయ లబ్ధి కోసమే సీఎం పర్యటన’

బోథ్, ఫిబ్రవరి 4: ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్ర వెల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీల సమస్యపై మాట్లాడక పోగా కేవలం ఎన్నికల ప్రచారం కోసమే వచ్చినట్లుగా ఉందని బోథ్ డివిజన్ తుడుందెబ్బ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు విమర్శించారు. ఆదివాసీ ల సమస్యను పోడు భూముల పట్టాల విషయమై ముఖ్యమంత్రిని కలి సి ఎందుకు జిల్లా అధికారులతో అనుమతి తీసుకున్న ఆదివాసీ నాయ కులతో తుడుం దెబ్బ సంఘం వారితో ముఖ్యమంత్రి కలిసేందుకు నిరా కరించారన్నారు. ముఖ్యమంత్రి కలవాలని ఉద్దేశంతో వేచి చూసిన సమయం ఇవ్వకపోవడం పట్ల తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీల విషయంపై ముఖ్యమంత్రి తన నిర్ణయం ప్రకటించాలని తుడుందెబ్బ డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో పందరం శంకర్, ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు, బోథ్ డివిజన్ ఉపాధ్యక్షుడు కురుమే రాజన్న, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కనక అమృతరావు, ఉపాధ్య క్షుడు మంగరపు మహేష్, కార్యదర్శి నల్లాల శ్రీకాంత్, నాయకులు తుడసం గోపాల్, ఆత్ర మోహన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన పూసాయి జాతర

జైనథ్, ఫిబ్రవరి 4: మండలంలోని పూసాయి గ్రామంలో ప్రతి సంవ త్సరం మాదిరిగానే పూసాయి ఎల్లమ్మ(రేణుకమాత) జాతర పుష్య మాసం నుంచి మాగమాసం వరకు నెల రోజుల పాటు జాతర కొనసా గుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ జాల్లల ప్రజల మహిళలు భక్తులు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర మహిళల భక్తులు పెద్ద ఎత్తున హాజరై పిండి వంటలతో కూడిన నైవేద్యాలను వండి ఎల్లమ్మ దేవికి నైవేద్యాలను సమర్పించారు. దీంతో పాటుచర్మ వ్యాధులు పాడి పంటలకు కోనేరు నీటిని చల్లితే చీడపీడలు దూరం అవుతాయని ఇరు రాష్ట్ర ప్రజలు మహిళలు భక్తులు స్థానిక కోనేరులో స్నానమాడారు. ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని ఎల్లమ్మ దేవికి కోళ్ల మేకలను బలిచ్చిమొక్కులను తీర్చుకున్నారు. ప్రజలకు భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘట నలు జరుగకుండా జైనథ్ మండల ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును నిర్వహించారు.


భక్తులతో కిటకిటలాడుతున్న పూసాయి ఎల్లమ్మ ఆలయం


సమ్మేళనంలో పాల్గొన్న 1998-99 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇచ్చోడ, ఫిబ్రవరి 4: ఇచ్చోడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించా రు. సుమారు 25ఏళ్ల నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తి, ఉద్యోగాలను పరిచయం చేసుకుని ఆత్మీయ పలకరింపులతో ఆనందోత్సవాల్లో రోజంతా గడిపారు. అనంత రం సహపంక్తి భోజనాలు చేశారు. బహుమతులు, జ్ఞాపికలు ఒకరినొక రు అందజేసున్నారు. ఇందులో పూర్వ విద్యార్థులు శ్యాంసుందర్, గంగా సాగర్, శ్రీనివాస్, రామకృష్ణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లేష్, రాజేందర్ రెడ్డి, దీపక్ సుద్దావర్, అన్నెల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ దగ్ధం

ఇచ్చోడ, ఫిబ్రవరి 4: మండలంలోని గాంధీనగర్ గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొ నడంతో ఒక బైక్‌లో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది. అప్పుడే అటుగా వెళ్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన వాహనాన్ని నిలిపి ఘటన వివరాలు తెలుసు కున్నారు. సంఘటనా స్థలం నుంచి 108 అంబులెన్స్‌కు స్వయంగా స మాచారం అందించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిం చారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు సంఘట న స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్‌కు చెందిన ఇరువురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.

ప్రజా సేవకు విరమణ లేదు : ఎమ్మెల్యే

తలమడుగు, ఫిబ్రవరి4: సర్పంచ్ పదువులకు విరమణ.. కానీ ప్రజా సేవకు విరమణ లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆది వారం మండలంలోని బరంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల పాత్ర వెల కట్టలేనిదన్నారు. అనం తరం మండలం 28 గ్రామపంచాయతీల మాజీ సర్పంచ్‌లకు ఘనంగా సన్మానించారు. ఇందులో మాజీ ఎంపీ నగేష్, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కేదరేశ్వర్‌రెడ్డి, అభిరాంరెడ్డి, తదితరులున్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం

నేరడిగొండ, ఫిబ్రవరి 4: మెదక్ జిల్లలో తుప్రాన్‌లో ఎస్టీ ఆర్నల్ఫ్ హైస్కూల్ 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 3 నుంచి 4 వరకు జరిగాయి. క్వార్టర్ ఫైనల్‌లో హైదరాబాద్ జట్టుతో 6-0తో గెలుపొంది, సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమిఫైనాల్‌లో మెదక్‌తో 2-0తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. ఫైనాల్‌లో నిజామాబాద్ జట్టుతో తలపబడి 0-8తో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీలకు ముఖ్య అతిథులు జిల్లా డీవైఎస్‌వో నాగరాజ్, ఇండియా సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రటరీ శోభన్‌బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి కె.నవీన్, ఇండియా సాఫ్ట్‌బాల్ కోచ్ చిన్నకృష్ణ పాల్గొని బహు మతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరాం, జిల్ల ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, కోచ్‌రవి, స్నేహా వి.అఖిల, ఎన్ఐఎస్ కోచ్, తదితరులు పాల్గొన్నారు.



● ఉట్నూర్ సీహెచ్‌సీ ముందు పెట్టిన జిల్లా ఆసుపత్రి బోర్డు

- ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రే పెద్దదిక్కు
- పేరుకే జిల్లా ఆసుపత్రి
- గర్భిణులు, బాలింతలకు అందని వైద్య సేవలు
- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- మొదటి మూడు నెలల నుంచి తొమ్మిది నెలల వరకు సక్రమంగా అందని పౌష్టిక ఆహారం
- ప్రసవ సమయంలో తప్పని తిప్పలు
- మరణాలు సంభవిస్తున్నా.. పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు!!
- మాతా, శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) నిర్మించడంలో అప్పటి పాలకులు విఫలం
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏజెన్సీ ప్రజల భారీ ఆశలు

మాతా, శిశు మరణాలకు అడ్డుకట్టేది?

ఉట్నూర్, ఫిబ్రవరి 4: గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మంజూరైన మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మించడంలో అప్పటి పాలకులు విఫలం కావడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అయిన ఎంసీహెచ్ భవన నిర్మాణం పూర్తి చేయాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి పెద్ద దిక్కు. గ్రామీణ ప్రాంతాలలోని గర్భిణులకు, బాలింతలకు సక్రమమైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల ఏజెన్సీ గ్రామాలకు చెందిన బాలింతలు ప్రసవ సమయంలో మరణిస్తున్నారు. గర్భిణులకు మొదటి మూడు నెలల నుంచి తొమ్మిది నెలలు వచ్చే వరకు అందించాల్సిన పౌష్టిక ఆహారం సక్రమంగా అందకపోవడంతో ప్రసవ సమయంలో మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం ఎంసీహెచ్ భవన నిర్మాణం కోసం రూ.17 కోట్లు మంజూరు చేసింది. జిల్లా అధికారుల సూచనల మేరకు ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు సైతం మండల కేంద్రంలోని ఉద్యానవన కేంద్రంలో ఐదు ఎకరాల భూమిని కూడా ఎంపిక చేశారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లే చేసి వాపస్ తెప్పించుకోవడంతో ఎంసీహెచ్ భవన నిర్మాణం అలాగే ఉండిపోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉట్నూర్‌కు మంజూరు చేసిన ఎంసీహెచ్ భవనంకు ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని, ఏజెన్సీలోని మాతాశిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకే జిల్లా ఆసుపత్రి

జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేసినందున.. ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ప్రకటిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యసేవలు అందించడానికి డాక్టర్లతో పాటు, వైద్య సిబ్బంది వంద మంది అవసరం అవుతారు. కానీ ప్రభుత్వం జిల్లా కేంద్ర ఆసుపత్రి ఏర్పాటు చేసున్నామని చెప్పి నేటికీ కూడా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బందిని మాత్రమే వినియోగిస్తున్నారు. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందక.. ప్రతినిత్యం పదుల సంఖ్యలో రోగులను స్థానిక ఆసుపత్రి సిబ్బంది రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి మంజూరు అయితే రేడియోలోజి సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని, ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్రంలో కేవలం ఐదు మిషన్‌లే ఉండడం వల్ల ఇతర ప్రాంతాలైన జన్నారం, దండేపల్లి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమెరి, నార్నూర్, గాదిగూడ మండలాల నుంచి వచ్చే డయాలసిస్ రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మరో ఐదు మెషిన్లను పెంచితే ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన డయాలసిస్ సేవలు అందుబాటులో ఉంటాయని పరిశీలకులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈఎన్‌టీతో పాటు చర్మవ్యాధి నిపుణులు కూడా అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న బ్లడ్ బ్యాంకులో కాంపోనెంట్స్ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు బ్లడ్ బ్యాంక్ సేవలు అంతంత మాత్రమే అవుతున్నాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులకు మార్చూరి గదులు ప్రత్యేకంగా నిర్మించినప్పటికీ.. ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి మార్చూరి గది ప్రత్యేకంగా లేకపోవడంతో శవాలను ఆరుబయటే డాక్టర్లు పోస్టుమార్టం చేస్తున్నారు.

సీహెచ్‌సీకి కొరత

ఉట్నూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు కావాల్సినంత మంది డాక్టర్లు లేరు. మత్తు డాక్టర్‌తో పాటు ముగ్గురు సాధారణ ఫిజీషియన్లు అయిన చెవి, ముక్కు, గొంతు వైద్యుల అవసరం ఉంది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న కొంత మంది డాక్టర్లకు పీజీలు రావడం వల్ల వెళ్లిపోయారు. కాగా మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇద్దరు కంటి వైద్యులు ఉన్నప్పటికీ.. వారు కేవలం అవుట్ పేషెంట్లను చూసి వెళ్లి పోతున్నారు. ఆసుపత్రిలో కంటి వైద్యం కోసం కావాల్సిన పరికరాలతో పాటు ఆపరేషన్ థియేటర్ ఎంతో అవసరం. ఇవేమీ లేకుండానే ఇద్దరు డాక్టర్లను నియమించించారు. అయినప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు కంటి వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. అంతేకాకుండా కరెంట్ అంత రాయం కలిగినప్పుడు కావల్సిన జనరేటర్ సౌకర్యం కూడా ఆసుపత్రికి లేదు. రాత్రుల్లో వార్డులలో ఉంటున్న రోగులు తమ వెంట తెచ్చుకున్న కొవ్వొత్తులను వెలిగించి ఉంటున్నారు. ఈ ఆసుపత్రికి 120 కేవీ జనరేటర్ అవసరం ఉన్నందున ప్రభుత్వం వెంటనే జనరేటర్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా ఎముకల డాక్టర్‌ను సైతం నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కాలం వరకు పనిచేసిన ఎముకల డాక్టర్ బదిలీ కావడంతో మరొకరిని ఇప్పటి వరకు నియమించకపోవడం విడ్డూరం. ఇదే కాకుండా నార్నూర్ మండల కేంద్రంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఆరేళ్ల క్రితం నిర్మించిన సీహెచ్‌సీకి కూడా వైద్యులను నియమించడంలో సంబంధిత శాఖల అధికారులు విఫలమయ్యారు. అన్నీ ఉన్న.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా నార్నూర్ ఆసుపత్రి పరిస్థితి తయారయ్యింది. అంతేకాకుండా ఈ ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించక పోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. 30 పడకల ఆసుపత్రి భవనం నిర్మించినా.. అలంకార ప్రాయంగా మారిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సరిపడా వైద్యులను నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



● ఉట్నూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్



వైద్యులను నియమించాలి

: పురక బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



ఉట్నూర్‌లోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ఉన్నతీకరించినందున.. వెంటనే వైద్యుల పోస్టులను మంజూరు చేయాలి. బోర్డుకి పరిమితమైన ఉట్నూర్ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నార్నూర్ మండలకేంద్రంలో కోట్లు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రి భవనంలో వైద్య సేవలు పొందేలా అవకాశం కల్పించాలి.

పరిశీలించి ప్రతిపాదనలు మళ్లీ పంపిస్తాం

: డాక్టర్ కుంర బాబు, ఏడీఎంహెచ్‌వో, ఉట్నూర్ ఏజెన్సీ



ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలో 2018లో మంజూరైన మాతా శిశు ఆరోగ్య భవనం నిధులు తిరిగి వెళ్లిన విషయమై పరిశీలించి ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తాం. ఏజెన్సీ కేంద్రంలో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఎంతో అవసరం ఉంది. అప్పుడే ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందుతాయి.

సంక్షిప్త సమాచారం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పాయల శంకర్

క్రీడలతో ఏకాగ్రత : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక బెల్లూరి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన న్యాయవాదులు, జైలు సిబ్బంది స్నేహపూర్వ క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని సరదాగా క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. జిల్లాలో క్రీడల అభివృదికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. స్నేహపూర్వక పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

‘దివ్యాంగులందరికీ ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలి’

తాంసి, ఫిబ్రవరి 4: మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నటుగానే దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రత్నాకర్ కోరారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వీరికి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దమనసుతో స్పందించాలని అన్నారు. ప్రస్తుతం తమకు సగం చార్జి తీసుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చార్జి కూడా లేకుండా తమకు బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విద్యాధర్, ఆశన్న, ఎల్లన్న, మహేందర్, లోడన్న, తదితరులు ఉన్నారు.

దేగామాలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు

తలమడుగు, ఫిబ్రవరి 4: మండలంలోని దేగామ గ్రామంలో జూనియర్ యువసేన యూత్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలను ఆదివారం జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన క్రీడలతో స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడతాయన్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడాకారులు దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలుగులోకి తీసుకు రావడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల ప్రోత్సాహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదే విధంగా యువకులు సామాజికస ఏవ కార్యక్రమాలు చేపడుతు ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను సద్వినియోగ పర్చుకుని ముందుకు వెళ్లాలని వారికి సూచించారు. దీగములు నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు దాదాపు 50 జట్లు క్రీడా పోటీల్లో పాల్గొన్న అన్నారు. ఇందులో ఎంపీటీసీ వెంకన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీక్, గ్రామస్థులు సుభాష్‌అనిల్, యువకులు దిలీప్, సచిన్, శంకర్, ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రాయి ఆలయానికి మెస్రంలు

● ఇంద్రాయి దేవతకు మెస్రం వంశీయుల ప్రత్యేక పూజలు ● 9న కేస్లాపూర్‌లో పవిత్ర గంగాజలాలతో నాగోబా మహా పూజ

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 4: పుష్యమాస అమవాస్యను పురస్కరించుకొని ఈ నెల 9న నిర్వహించే నాగోబా మహా పూజకు అవసరమగు గంగా జలం కోసం గోదావరి నది హస్తిన మడుగుకు వెళ్లి పవిత్ర గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు తిరుగు ప్రయాణంలో ఇంద్రవెల్లి మండలంలోని దోడంద గ్రామానికి గ్రామ పొలిమేరలో పవిత్రమైన గంగా జలాన్ని చెట్టుపై భద్రంగా ఉంచారు. ఆదివారం సాయంత్రం గంగా జలంతో ఎడ్ల బండ్లను తీసుకొని ఇంద్రాయి అలయానికి బయల్దేరారు. సోమవారం ఉదయం ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయానికి చేరనున్నారు. ఇంద్రాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో గల మర్రి చెట్టు వద్దకు చేరి భస చేయనున్నారు. మర్రి చెట్టు వద్ద మూడు రోజులు బస చేసి వారి సంప్రదాయ పూజలతో పాటు మెస్రం వంశంలో మరణించిన పెద్దల పేర్లతో తూమ్(ఖర్మకాండ) పూజలు చేయనున్నట్లు మెస్రం వంశీయులు తెలిపారు. పుష్యమాస అమవాస్యను పురస్కరించుకొని ఈ నెల 9న పవిత్రమైన గంగా జలంతో నాగోబా విగ్రహానికి నాగోబా ఆలయానికి జలభిషెకం చేసి మహా పూజ నిర్వహించి నాగోబా జాతరను ప్రారంభించనున్నట్లు నాగోబా అలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు తెలిపారు.



ఎడ్లబండితో పయనమైన మెస్రం వంశీయులు



నాగోబా పూజ సామగ్రితో మెస్రం వంశీయులు, మహిళలు

అమరవీరుల కుటుంబాలకు స్వాంతన

● ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి 4: ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఇంద్రవెల్లి కాల్పులకు క్షమాపణలు చెప్పి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభతో చనిపోయిన కుటుంబాల వారసులకు ఇండ్ల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించడంతో పాటు రూ.5 లక్షల వంతున ఒక్కొక్కరికి ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, ట్రైకర్ ద్వారా ప్రత్యేక రుణ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం అయ్యాక ఇంద్రవెల్లిలో తొలిసారిగా దళిత దండోరా కార్యక్రమాన్ని ప్రారంభించారని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక.. తిరిగి మరోసారి ఇంద్రవెల్లి నుంచి తెలంగాణ పునర్నిర్మాణక సభ చేపట్టారన్నారు. ఇస్లాపూర్ ఆలయం అభివృద్ధి కోసం రూ.6 కోట్లు కేటాయించడంతో పాటు మరో కోటి రూపాయలు కూడా అదనంగా కేటాయించడం జరిగిందని, ఇంద్రవెల్లి మండలంలో 33 రోడ్ల కోసం రూ.22.20 కోట్లు మంజూరు చేశారని, గురుకుల పాఠశాలల కోసం రూ.10కోట్లు మంజూరు చేశారని రూ.కోటి స్మృతి వనం అభివృద్ధి కోసం ప్రకటించారని, కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.5.46 కోట్లు మంజూరు చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టిన నేటి వరకు మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు మంచినీరు అందడం లేదని భావించి బూసి మెట్ట క్యాంపు వద్ద పంప్‌హౌజ్ నిర్మాణం కోసం రూ.60 కోట్లు మంజూరు చేశారని, అదే విధంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి 15వేల ఉద్యోగాల భర్తీ కోసం ముఖ్యమంత్రి ప్రకటించారని అన్నారు. సదర్‌మాట్, చనకా కోర్టా, కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రకటించారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● కొందరు పిచ్చికుక్కల్లాగా మాట్లాడుతున్నారు

ఒకవైపు ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తుంటే కొందరు పిచ్చికుక్కల్లాగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మండిపడ్డారు. జాన్సన్‌నాయక్, జోగు రామన్నలతో పాటు మరికొందరు చెప్తా లీడర్లు ప్రజలను తప్పుతోవ పట్టించే విధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. కొందరు బట్టే వాచ్ నాయకులు ఇంద్రవెల్లి స్థూపానికి పాలాభిషేకం చేయడం విడ్డూరమన్నారు. నేను మంత్రి సీతక్కతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పాదరక్షలు లేకుండానే స్థూపం వద్దకు వెళ్లి ఇంద్రవెల్లి అమరులకు నివాళులర్పించామని అన్నారు. స్మృతి వనం పనుల మంజూరు వరకు అధికారిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ పునర్నిర్మాణ సభ ఇతరచోట నిర్వహించుకున్నామని అన్నారు. తుడుందెబ్బ ముఖ్యమంత్రి కలవలేక పోవడంతోనే స్థూపం వద్ద శుద్ధి డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. సీఎంను కలవడానికి గిరిజనేతరులతో పాటు 317 బాధిత ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సీపీఐ సీపీఎం నాయకులు, 10 సంఘాల వారు ప్రయత్నం చేశారని, ముఖ్యమంత్రికి కలవాలని ఉన్న హెలిక్యాప్టర్ సంఘ బావం వల్లనే కలవలేక పోయారన్నారు. కేటీఆర్‌కు కడెం ప్రాజెక్టు ఎ క్కడుందో తెలియదని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కడెంలో సమావేశం పెట్టి సదర్‌మాట్‌కు ఏమీ ఇచ్చారని ప్రశ్నించారు. జాన్సన్‌నాయక్ నోరు అదుపులో పెట్టుకో అని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ధర్నాలు చేయకుండా ధర్నాచౌక్‌ను ఎత్తివేస్తారని, తాము పునరుద్ధరిం చామన్నారు. తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాంకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అవకాశమిస్తే బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ ఖయ్యుం, ఇక్బాల్, లింగంపల్లి చంద్రయ్య, సోమాసి వెంకట్రావు, మల్లేష్‌యాదవ్, బెల్లూరి గోవర్ధన్‌రెడ్డి, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



సదస్సులో పాల్గొన్న ఆయా సంఘాల నాయకులు

‘గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి’

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల, రైతు సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సెంట్రల్ గార్డెన్‌లో కేంద్ర కార్మిక సంఘాల, రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతుందని, కార్మికులకు రైతులకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు హాజరైన కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని ప్రతీ ఇంటింటికీ కరపత్రాన్ని పంచి ప్రజలందరికి బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అన్యాయాన్ని ప్రజలందరికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లను మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మికవర్గం రైతులు బుద్ధి చెప్పాలని కోరారు. నాలుగు లేబర్ కోట్లు అమలైతే సంఘం పెట్టుకునే హక్కుని కోల్పోతారు. వ్యవసాయ చట్టాలను తీసుకొస్తే రైతులందరికీ అన్యాయం జరుగుతుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని కార్మికులను రైతులను వారు ఈ సందర్భంగా కోరారు. ఇందులో విలాస్, శ్రీనివాస్, రాజన్న, బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, లంక రాఘవులు, బండి దత్తాత్రి, దేవేందర్, కుంటాల రాములు, ఇజ్జగిరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

నిధులను నిలిపి వేయడం అమానుషం

● న్యూహౌజింగ్ బోర్డు కాలనీ వాసుల నిరసన

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4: రూ.50 కోట్ల నిధుల మళ్లింపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని, ఆదిలబాద్‌లో దత్త తీసుకుంటానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పట్టణాభివృద్ధికి ఇచ్చిన రూ.50 కోట్లను మళ్లింపు చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి విడుదల చేస్తున్న రూ.50 కోట్లను మంజూరు చేయాలని కోరుతూ న్యూహౌజింగ్ బోర్డు కాలనీ వాసులు వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా నిధులు మాకు కేటాయించాలంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అలాగే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఆదిలాబాద్‌లో నిధులను నిలిపి వేయడం సమంజసం కాదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటానని చెప్పిన ఇప్పటి వరకు చేయక పోగా ఆదిలాబాద్‌కు వచ్చిన రూ.50కోట్ల నిధులను సైతం నిలిపి వేయడం సమంజసం కాదని కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ నాయక్, రాథోడ్‌ప్రకాస్, దీపక్, విలాస్, తులసిరాం, పొచ్చారెడ్డి, కలీం తదితరులు పాల్గొన్నారు.